



# కరపత్రం

SINCE 2014

బుధవారం ఆగస్ట్ 13 2025 | సంపుటి :0 | సంచిక :298 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## సిబిఐకి న్యాయవాద దంపతుల హత్య కేసు

### స్వాగతించిన మంత్రి శ్రీధర్ బాబు



న్యాయవాదులు గట్టు- వామనరావు దంపతుల హత్యకేసును సీబీఐకి అప్పగించడాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్ అబిడ్స్‌లోని ఓ కార్యక్రమానికి హాజరైన మంత్రి..

2లో

# తెలంగాణకు భారీ వర్ష సూచనతో అప్రమత్తం

### 72 గంటలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం
### కరెంట్, మంచినీటి ఇబ్బంది రాకుండా చర్యలు
### ఉద్యోగులకు మూడురోజుల పాటు సెలవులు రద్దు
### అధికారులు, కలెక్టర్లతో సిఎం రేవంత సమీక్ష



తెలంగాణలో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. అధికారులు, జిల్లా కలెక్టర్లు, మంత్రులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మూడు రోజుల పాటు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సెలవులు రద్దు చేయాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రులు శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలపై సీఎం రేవంత్ దిశానిర్దేశం చేశారు. భారీ వర్షాలపై 72 గంటలు అప్రమత్తంగా ఉండాలని ఇంచార్జి మంత్రులు, అధికారులకు సూచించిన సీఎం.. రానున్న మూడు రోజులు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సెలవులు రద్దు చేయాలని ఆదేశించారు.

2లో

## బిఆర్ఎస్ కదనభేరీ సభ మరోమారు వాయిదా

- భారీ వర్షాల నేపథ్యంలో వాయిదా వేసినట్లు ప్రకటన
- త్వరలోనే మళ్లీ సభ నిర్వహణ తేదీ ప్రకటిస్తామన్న గంగుల



కరీంనగర్ వేదికగా బిఆర్ఎస్ నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభను వాయిదా వేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలనే ఉద్దేశ్యంతో బీఆర్ఎస్ పార్టీ కదనభేరి పేరిట నిర్వహించ తలపెట్టిన బీసీ గర్జన సభను మరోసారి వాయిదా వేసింది. భారీ వర్ష సూచన నేపథ్యంలో ఈ భారీ బహిరంగ సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

2లో

## ఎసిబికి చిక్కిన మహిళా ఉద్యోగి



### లంచం తీసుకుంటుండగా పట్టివేత

తెలంగాణ వ్యాప్తంగా అవినీతి అధికారుల గుండెల్లో ఏసీబీ గుబులు పుట్టిస్తోంది. లంచం తీసుకుంటున్న ప్రభుత్వ అధికారుల భరతం పడుతోంది. ఫిర్యాదులు వచ్చిన వెంటనే రంగంలోకి దిగి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుంటోంది. అయినా ప్రభుత్వ అధికారుల తీరు మారడం లేదు. లంచాల కోసం టేబుల్ కింద చేయిపెడుతున్నారు.

2లో

## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. హైదరాబాద్ విద్యార్థిని మృతి



దుండిగల్: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన విద్యార్థిని మృతి చెందింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా రామారుకల గ్రామానికి చెందిన శ్రీనివాస్ వర్మ, హేమలత దంపతులకు శ్రీజా వర్మ, శ్రేయా వర్మ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాస్ వర్మ దంపతులు బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చారు. మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ చౌరస్తా సమీపంలోని శ్రీకృష్ణానగర్‌లో నివాసముంటున్నారు. శ్రీనివాస్ వర్మ డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. ఆయన భార్య ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నారు.

వీరి పెద్ద కుమార్తె శ్రీజా వర్మ ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లింది. ఈ మధ్యే ఎంఎస్ పూర్తి చేసింది. సోమవారం రాత్రి (భారత కాలమానం ప్రకారం) అపార్ట్‌మెంట్ నుంచి బయటకు వచ్చి భోజనం చేసేందుకు కారులో రెస్టరంట్‌కు వెళ్లింది. భోజనం చేసి తిరిగి వస్తుండగా ఆమె వాహనాన్ని ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీజా వర్మ తీవ్రంగా గాయపడి మృతిచెందింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో శ్రీజా వర్మతో పాటు ఆమె స్నేహితురాలు కూడా ఉన్నట్లు సమాచారం. శ్రీనివాస్ వర్మ చిన్న కుమార్తె శ్రేయా వర్మ సైతం ఎంఎస్ చేసేందుకు 20 రోజుల క్రితం అమెరికా వెళ్లింది.

## తెలంగాణలో ఎనిమీ ప్రాపర్టీస్‌పై తక్షణమే సర్వే చేయండి

### కేంద్రమంత్రి బండి సంజయ్ ఆదేశం



దిల్లీ: నెలాఖరులోపు స్వాతంత్ర్య సమరయోధుల పింఛను కేసులను పరిష్కరించాలని అధికారులను కేంద్రమంత్రి బండి సంజయ్ ఆదేశించారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. తెలంగాణలోని ఎనిమీ ప్రాపర్టీస్ కేసుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన.. దీనిపై తక్షణమే సర్వే చేయాలని ఆదేశించారు.

దేశవ్యాప్తంగా 12,800 ఎనిమీ ప్రాపర్టీస్ ఉన్నాయని కేంద్రమంత్రికి అధికారులు తెలిపారు. 600కుపైగా ప్రాపర్టీస్ వేలందశలో ఉన్నాయని వివరించారు. వేలం వేసిన ఆస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.107 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. పెండింగ్ ఫైళ్లను వేగంగా క్లియర్ చేసిన అధికారులను కేంద్రమంత్రి అభినందించారు.

## భారీ వర్ష సూచన.. వచ్చే మూడు రోజులు ప్రజలు బయటకు రావొద్దు: హైడ్రా




2లో


## సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసు సిట్‌కు బదిలీ

### నార్త్‌జోన్ డీసీపీ రశ్మీ పెరుమాళ్



హైదరాబాద్: సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసును సిట్‌కు బదిలీ చేసినట్లు నార్త్ జోన్ డీసీపీ రశ్మీ పెరుమాళ్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆమె మీడియాకు వెల్లడించారు. జులైలో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు చెప్పారు. “ఈ కేసులో మొదట 8 మందిని.. తర్వాత 16 మందిని అరెస్టు చేశాం. అరెస్టయిన వారిలో వైద్యులు, ఏజెంట్లు ఉన్నారు. రెండో కేసులో చనిపోయిన బేబీని చూపించి బాధితుల నుంచి రూ.10లక్షలు నుంచి రూ.20లక్షలు వసూలు చేశారు. డాక్టర్ నమ్రత బ్యాంక్ ఖాతాను నిలిపివేశాం.

2లో



## పోటెత్తిన వరద.. నాగార్జున సాగర్ 18 గేట్లు ఓపెన్

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. ఎగువ నుంచి లక్షా 86 వేల 384 క్యూసెక్కులు వరద వస్తుండటంతో 18 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు లక్షా 86 వేల 384 క్యూసెక్కుల నీటిని వదులుతోన్నారు. పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 589.40 అడుగులుగా ఉంది. సాగర్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు..ప్రస్తుతం 310.5510 టీఎంసీలుగా ఉంది. జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. సాగర్ గేట్లు ఎత్తటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను జాగ్రత్తగా ఉండాలని అధికారులు అప్రమత్తం చేశారు. ప్రాజెక్ట్ పరివాహక ప్రాంతంలోకి వెళ్లొద్దని హెచ్చరించారు.

గత కొద్ది రోజులుగా ఎగువన కురుస్తోన్న వర్షాలతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. దీంతో ఇప్పటికే జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులు నిండుకుండలా మారగా.. వరద ప్రవాహం కొనసాగుతుండటంతో గేట్లు ఓపెన్ చేసి సాగర్?కు నీటిని వదులుతున్నారు. సాగర్ గేట్లు ఎత్తడంతో కృష్ణమ్మ పరవళ్లను ప్రత్యక్షంగా చూసి పులకించిపోయేందుకు పర్యాటకులు నాగర్జున సాగర్‌కు క్యూ కడుతున్నారు. పర్యాటకులతో సాగర్ ప్రాజెక్ట్ వద్ద సందడి వాతావరణం నెలకొంది. సాగర్‌లోని కొత్త బ్రిడ్జి, పవర్‌హౌస్, ప్రధాన డ్యాం క్రస్ట్ గేట్ల సమీపంలో, శివాలయం రోడ్‌లో సెల్ఫీలు దిగుతున్నారు

# సంపాదకీయం

## అగ్రరాజ్య ఆటలో భారత్ ఒడ్డున పడేనా

ఆదర్శాలు, ఆర్థిక ప్రయోజనాలు.. ఈ రెండిటినీ విడదీసి చూస్తే అసలు విషయాలు అర్థంకావు. ఆదర్శాలకు అనేక ముసుగులు ఉంటాయి. ఒక్కోదాన్ని తొలగించుకుంటూ వెళ్తే తప్ప అసలు ప్రయోజనాలను పసిగట్టలేం. ఆధిపత్యం చేజారిపోతున్నప్పుడు ముసుగులు తీసేసి ఎట్లా మాట్లాడుతారో తెలుసుకోవాలంటే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైపే చూడాలి! స్వేచ్ఛావాణిజ్యం గురించి ప్రపంచానికి ఒకనాడు అమెరికా చెప్పిన ఆదర్శాలు అన్నీఇన్నీ కావు. ఇప్పుడు అవన్నీ పక్కకుబెట్టి అసంబద్ధ ఏకపక్ష సుంకాలతో దేశాలను శాసించటం ట్రంప్‌కు ఒక విధానంగా మారిపోయింది. భారత్ వస్తువులపై 50 శాతం సుంకాలను విధించి తనది అసలుసిసలైన నయాసామ్రాజ్యవాద పోకడగా నిరూపించుకున్నారు. దీన్ని ఎదుర్కోటానికి మోదీ ప్రభుత్వం కిందామీదా పడుతోంది. విదేశాంగ విధానానికి సంబంధించి ఇటీవల కాలంలో ఎన్నడూ ఎరుగని సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది.

గడచిన 25 ఏళ్లుగా అమెరికా అండను పొందటమే ప్రధానంగా భారత విదేశాంగ విధానం రూపుదిద్దుకుంది. ఆర్థికంగా, సాంకేతికంగా, సైనికశక్తి పరంగా అనూహ్యవేగంతో దూసుకుపోతున్న చైనాను నిలువరించటానికి అమెరికాకు భారత్ కావాల్సి వచ్చింది. దక్షిణాసియాలో సైతం పెరిగిపోతున్న చైనా ప్రాధాన్యాన్ని నిలువరించటానికి అన్నిరంగాల్లో అమెరికాతో ఇచ్చిపుచ్చుకోవటం భారత్‌కూ వ్యూహాత్మక అవసరమైంది. నిజానికి ఆపరేషన్ సిందూర్ తర్వాత ఆ అవసరం భారత్‌కు ఇంకా ఎక్కువైంది. కానీ పరిస్థితులు భిన్నంగా, అనూహ్యంగా మారిపోతున్నాయి. ఆపరేషన్ సిందూర్ సాఫల్య, వైఫల్యాలపై రక్షణ వ్యవహారాల నిపుణులు లోతైన విశ్లేషణలు చేస్తున్నారు. పాకిస్థాన్ ఆయుధ సంపత్తిలో చైనా పాత్ర అందరికీ తెలుసు. కానీ పాక్ యుద్ధతంత్రమూ, దాని అమలూ కూడా చైనా కనుసన్నల్లో నడుస్తోందన్న విషయం ఆపరేషన్ సిందూర్ సందర్భంగా స్పష్టమైంది. యుద్ధం అన్న తర్వాత నష్టాలు ఉంటాయి. అయితే ఆ నష్టాలు సమానంగానో, ఊహించని రీతిలో కాస్త ఎక్కువగానో ఉంటే సమస్యలు మొదలవుతాయి. చైనా వ్యూహాత్మక మద్దతుతో సాగిన యుద్ధంవల్లే అవి వస్తే మన భవిష్యత్తు అడుగులను తీవ్రంగా ప్రభావితం చేసేవిగా ఉంటాయి. భారత్ చుట్టూ చక్రబంధంలా చైనా మారిపోయిన కఠోర పరిస్థితుల్లో ట్రంప్ చర్యలు ఎంత అవమానకరంగా అనిపించినా తాడోపేడో తేల్చుకోటానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదు. రష్యాతో మైత్రినీ, చమురు కొనుగోళ్లనూ వదులుకోబోమని ఒకవంక చెబుతూనే మరోవైపు చైనాతో కూడా సామరస్యంగా వ్యవహరించటానికే మొగ్గుచూపుతున్నట్లు సంకేతాలు ఇస్తోంది. అందుకే ప్రధాని మోదీ ఈ నెలాఖరులో చైనాలో పర్యటించబోతున్నారు. తమకు ప్రత్యామ్నాయ మార్గాలు కూడా ఉన్నాయని చెప్పటమే భారత్ తక్షణ లక్ష్యంగా కనపడుతోంది.

ఒకటి మాత్రం నిజం. చైనా, భారత్, రష్యాలు ఆర్థికంగా సహకరించుకుంటే ట్రంప్ అంచనాలన్నీ తారుమారవుతాయి. అమెరికా ఆర్థిక, సైనిక ఆధిపత్యం మరింత దిగజారుతుంది. అమెరికాకు 75 ఏళ్లల్లో ఎన్నడూ చూడని సవాళ్లు ఎదురవుతాయి. ఇదే జరిగితే యూరప్ దేశాలు అమెరికాకు తానాతందాన అనే పరిస్థితి నుంచి బయటపడొచ్చు. లాటిన్ అమెరికాలో కూడా అమెరికా ఆధిపత్యానికి గండిపడుతుంది. ఇప్పటికే బ్రెజిల్ అమెరికాపై చాలా కోపంగా ఉంది. అమెరికాను ఆధిపత్యధోరణుల కట్టడి చేయటానికి చైనా, భారత్‌లు సమష్టిగా అడుగులు వేస్తే చరిత్ర కొత్త మలుపుతిరుతుంది. ఆ మలుపు అంత సులభం కాదు. అభిలాషతో అన్నీ జరగవు. రెండు దేశాల మధ్య ఇప్పటిదాకా జరిగిన పరిణామాలు, పోటీలు, వివాదాలే అందుకు కారణం.

భారత-చైనా మధ్య వివాదాలు ఈనాటివి కావు. ఆసియాలో ఆధిపత్యం, నాయకత్వ పాత్రపై రెండు దేశాల మధ్య పెనుగులాటలు 1950ల నుంచే మొదలయ్యాయి. బ్రిటిష్ వలసపాలకులు నిర్ణయించిన సరిహద్దులను అంగీకరించబోమని చైనా, వాటిని యథాతథంగా కొనసాగించాలని భారత్ పట్టుబట్టటంతోనే వివాదం మొదలైంది. 1950ల నాటికే అక్సాయిచిన్ ప్రాంతం చైనా నియంత్రణలో ఉంది. ఉపగ్రహచిత్రాల్లేని ఆ రోజుల్లో అక్సాయిచిన్‌లో జనసంచారం, సైనికుల కదలికల గురించి తెలుసుకునే అవకాశమే లేదు. అందుకే ఆ నియంత్రణ గురించి భారత్‌కు చాలా ఆలస్యంగా తెలిసింది. 1951లో టిబెట్‌ను చైనా స్వాధీనం చేసుకున్న నాటి నుంచే చైనా కదలికలను సునిశితంగా పరిశీలించటం ఎంతోకొంత మొదలైంది. అక్సాయిచిన్ ఎడారి ప్రాంతం. లద్దాఖ్ మహారాజు 1865లో దాన్ని స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. అంతకుముందు బ్రిటిషు సైన్యం చేతుల్లో సిక్కు రాజ్యం (1846) ఓడిపోయింది. ఆ తర్వాత లద్దాఖ్‌ను లాంఛనంగా స్థానిక మహారాజాకు అప్పగించారు. లద్దాఖ్ తూర్పు ప్రాంతమైన అక్సాయిచిన్‌కు సంబంధించి సరిహద్దులేవీ అప్పటికి స్పష్టంగా లేవు. అక్సాయిన్ ఎడారికి ఇవతల ఉన్న కారాకోరం పర్వతాలనే లద్దాఖ్‌కు తూర్పు సరిహద్దుగా భావించేవారు. కానీ 1865లో లద్దాఖ్ మహారాజు సర్వే జరిపించి ఈశాన్యంలో పర్వతాలకు అవతలున్న అక్సాయిచిన్ ఎడారి ప్రాంతాన్ని కూడా లద్దాఖ్‌లో కలిపి సర్వేపటాన్ని సిద్ధంచేశారు. సర్వేయర్ జాన్సన్‌కు లంచమిచ్చి పటాన్ని అలా తయారుచేశారన్న ఆరోపణలు అప్పుడే వచ్చాయి. బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం జాన్సన్‌ను ఉద్యోగం నుంచి తొలగించింది. సరిహద్దును విస్తరించటం బ్రిటిష్ ఇండియా ప్రభుత్వానికి అప్పట్లో ఇష్టంలేదు. జాన్సన్‌కు లద్దాఖ్ మహారాజు తర్వాతి కాలంలో ప్రధానమంత్రి పదవిని కట్టబెట్టారు. రష్యా సామ్రాజ్య విస్తరణను దృష్టిలో పెట్టుకుని కారాకోరం పర్వతశ్రేణిని సరిహద్దుగా నిర్ణయిస్తే బాగుంటుందని భావించిన బ్రిటిషు పాలకులు ఆ మేరకు మాకార్ట్నీ మక్డోనాల్డ్ పేరిట 1890ల్లో సర్వేపటాన్ని తయారుచేసి చైనాకు పంపారు. దానిపై చైనా స్పందించలేదు. స్పందన లేకపోవటాన్ని ఆమోదంగా భావించి 1941 వరకూ దాన్నే సరిహద్దుగా పరిగణించారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో సోవియట్ సైనికదళాలు అక్సాయిచిన్ ఉత్తరభాగంలో సంచరిస్తున్నాయని తెలుసుకుని జాన్సన్ ప్రతిపాదించిన మేరకు లద్దాఖ్ సరిహద్దుని మళ్లీ విస్తరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. జాన్సన్ సరిహద్దు గురించి చైనాకు అధికారికంగా ఎప్పుడూ తెలపలేదు. లద్దాఖ్ సరిహద్దును తాము ఆమోదించలేదని 1954లో చైనా స్పష్టంచేసింది.

అరుణాచల్ ప్రదేశ్‌పై వివాదానికీ చాలా చరిత్ర ఉంది. 1911లో చైనాలో వచ్చిన విప్లవాన్ని ఆసరాగా తీసుకుని అప్పటి టిబెట్ పాలకుడు స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. చైనా ప్రభుత్వం దాన్ని అంగీకరించలేదు. బ్రిటన్ మాత్రం టిబెట్‌ను బఫర్‌జోన్‌గా ఉపయోగించుకోవాలని భావించింది. చైనా, టిబెట్, బ్రిటిషు ఇండియా ప్రభుత్వాల మధ్య చర్చలు జరిగాయి. ఏకాభిప్రాయం కుదరలేదు. ఇదే సమయంలో టిబెట్- ఇండియా మధ్య సరిహద్దుని ఉత్తరాన 60 మైళ్ల ముందుకు జరిపి హిమాలయాల హద్దుగా ఒక ప్రతిపాదన చేశారు. బ్రిటిష్ ఇండియా విదేశాంగ మంత్రిగా ఉన్న హెన్రీ మక్‌మాన్ దాన్ని ప్రతిపాదించటం వల్ల అదే పేరుతో ప్రచారమైంది. స్థానిక గిరిజన ప్రాంతాలతో పాటు తవాంగ్‌ను కూడా కొత్త సరిహద్దుల్లో కలిపారు. ఆ ప్రాంతాలకు తర్వాత నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ ఏజన్సీగా పేరుపెట్టారు. చర్చల్లో చైనా ప్రతినిధి కొత్త సరిహద్దులను ఆమోదించారని బ్రిటిష్ ఇండియా పాలకులు ప్రకటించారు. చైనా ప్రభుత్వం దాన్ని అప్పుడే తోసిపుచ్చింది. లండన్‌లోని బ్రిటిషు ప్రభుత్వం మొదట్లో మక్‌మాన్ సరిహద్దుని ఆమోదించలేదు. కొన్ని సవరణలతో తర్వాత దాన్ని ఆమోదించినా అప్పటి నుంచి చైనా వ్యతిరేకిస్తూనే ఉంది.

# తెలంగాణకు భారీ వర్ష సూచనతో అప్రమత్తం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్‌తో పాటు వరద ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ నియంత్రణకు లా అండ్ ఆర్డర్ పోలీసుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్ ట్రాఫిక్ నియంత్రణకు లా అండ్ ఆర్డర్ పోలీసుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అకస్మిక వరదలు సంభవించినపుడు ఎయిర్ లిఫ్టింగ్ చేసేందుకు అవసరమైన హెలికాప్టర్స్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. విద్యుత్ కు సంబంధించి అత్యవసర సమయాల్లో ఉపయోగించుకునేందుకు వీలుగా మొబైల్ ట్రాన్స్‌ఫర్స్ అందుబాటు లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్ లో వరదలపై హైడ్రా




అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అత్యవసర సమయాల్లో ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. స్కూల్స్, కాలేజీలు, ఐటీ- సెక్టార్ ఉద్యోగులకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులు తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. భారీ వర్షాల సమయంలో బయటకు రాకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు, వరదలపై మీడియా ద్వారా సమాచారం చేరవేయాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ సిబ్బందిని అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. భారీ వర్షాలు ఉన్న జిల్లాలకు ముందే సిబ్బందిని తరలించాలని అన్నారు.ఆయా జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల ఉద్యోగుల సెలవులు రద్దు చేయాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించేందుకు హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు- చేయాలని రేవంత్ అన్నారు. వైద్యులు అత్యవసర పరిస్థితుల్లో సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. హైదరాబాద్‌లో వరద ప్రభావిత ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా చూడాలని స్పష్టం చేశారు. కంట్రోల్ రూమ్ ద్వారా అధికారులను అప్రమత్తం చేయాలని తెలిపారు. భారీ వర్షాలు, రెడ్ అలర్ట్ ఉన్న జిల్లాల్లో సీనియర్ అధికారులను నియమించాలని అన్నారు.

## సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసు సిట్‌కు బదిలీ

మొదటిపేజీ తరువాయి

గైనకాలజీ డాక్టర్ సూరి శ్రీమతి పేరుపై ఉన్న లైసెన్స్ నంబర్, లెటర్ హెడ్స్‌తో అక్రమాలు చేశారు. ఆమె ఫిర్యాదు చేయడంతో మరో కేసు నమోదు చేశాం. సికింద్రాబాద్‌లో సృష్టి సెంటర్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా నడిపిస్తున్నారు. ఈ సెంటర్‌కు అనుమతులు రద్దయి చాలా కాలమైంది. ధనశ్రీ సంతోషి ప్రధాన ఏజెంట్ కాగా.. మరికొందరిని సబ్ ఏజెంట్లుగా నియమించుకొని నెట్‌వర్క్‌ను విస్తరించారు. విశాఖ నుంచి పిల్లల వైద్యురాలు విద్యుల్లత, వైద్యులు రవి, ఉష పనిచేశారు. ఈ కేసులో సరోగేట్‌గా, అండదానం ఇచ్చే వారిగా కొందరు మహిళా ఏజెంట్లు నటించారు. ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మా వర్కర్స్ కూడా ఈ కేసులో భాగస్వాములుగా ఉన్నారు. 9 నెలల పూర్తవుతున్న గర్భవతులను గుర్తించి సరోగసీ కోసం వచ్చిన తల్లిదండ్రులకు అప్పగించారు. మగ బిడ్డకు రూ.4.5 లక్షలు, ఆడబిడ్డకు రూ. 3లక్షల ధర నిర్ణయించారు. ఇలాంటి సెంటర్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అనుమతులు ఉన్న వాటినే సంప్రదించాలి"అని డీసీపీ రష్మీ పెరుమాళ్ సూచించారు.

## గోషామహల్ స్టేడియానికి ఉస్మానియా ఆస్పత్రి తరలింపు.. ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు



హైదరాబాద్: ఉస్మానియా జనరల్ ఆస్పత్రిని గోషామహల్ స్టేడియానికి తరలింపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. గోషామహల్ స్టేడియంలో కొత్త భవనం నిర్మించి ఉస్మానియా ఆస్పత్రిని అక్కడికి తరలించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ రాము అనే వ్యక్తి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. స్టేడియానికి చెందిన స్థలాన్ని ఆస్పత్రి కోసం బదలాయిస్తూ తీసుకున్న నిర్ణయం ఏకపక్షమని, పట్టణ ప్రాంతాల అభివృద్ధి చట్టాలకు విరుద్ధమని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఆ స్టేడియంలో పాఠశాల ఉందని, విద్యార్థులకు చెందిన ఆటస్థలంలో ఆస్పత్రి నిర్మాణం సరికాదన్నారు. ప్రస్తుతం మైదానం కూల్చివేత పనులు జరుగుతున్నాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

అక్కడ ఉన్న ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులను ఇతర పాఠశాలల్లో సర్దుబాటు చేసినట్లు అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి కోర్టుకు తెలిపారు. పేదలకు వైద్య సదుపాయం అందించడానికే ఆస్పత్రి నిర్మాణం జరుగుతోందన్నారు. ఎంత స్థలంలో నిర్మాణం చేపడుతున్నారని ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. ఎంత స్థలంలో కడుతున్నాం.. ఎంత ఖాళీ స్థలం ఉంటుంది తదితర పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయడానికి గడువు కావాలని ఏజీ కోరారు. దీనికి అనుమతిస్తూ విచారణను సెప్టెంబర్ 26కు వాయిదా వేసింది. ఆలోగా ఆస్పత్రి తరలింపునకు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

## కశ్మీర్‌లో బలగాలకు సవాల్..! ఎవరీ 'బెడ్‌రూం జిహాదీలు'

ఇంటర్నెట్ డెస్క్: జమ్మూకశ్మీర్ లో ఉగ్రవాదులతో ఏళ్ల తరబడి ప్రత్యక్ష పోరాడిన భద్రతాదళాలు ప్రస్తుతం రహస్య శత్రువును ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఇంట్లోనే కూర్చుని సామాజిక మాధ్యమాల వేదికగా తప్పుడు సమాచార వ్యాప్తికి పాల్పడుతోన్న, వర్గ విభేదాలను రెచ్చగొడుతున్న 'బెడ్‌రూం జిహాదీ'ల రూపంలో వారికి కొత్త సవాల్ ఎదురవుతోంది. సాంప్రదాయ ఉగ్రవాదులకు భిన్నంగా ఉండే ఈ దుర్మార్గులు జమ్మూకశ్మీర్‌ను అస్థిరపరిచే ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీనికోసం సోషల్ మీడియాలో అనేక నకిలీ ఖాతాలు తెరిచినట్లు గుర్తించినట్లు వెల్లడించారు.కశ్మీర్ లోయలో మత కలహాలు, అశాంతి సృష్టించాలనే లక్ష్యంతో దుష్ప్రచారం, రెచ్చగొట్టే కంటెంట్ వ్యాప్తికి పాల్పడుతున్న సోషల్ మీడియా ఖాతాల నెట్‌వర్క్‌ను అధికారులు తమ దర్యాప్తులో గుర్తించారు. పాకిస్థాన్‌లోని ఉగ్ర సంస్థలు, వాటి సానుభూతిపరులు దీన్ని నియంత్రిస్తున్నట్లు భావిస్తున్నారు. అనేక వారాలుగా కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా వేలాది సోషల్ మీడియా పోస్టులు, వ్యాఖ్యలు, ప్రైవేటు సందేశాలను అధికారులు విశ్లేషించారు. ఈ క్రమంలోనే ఈ సంఘ విద్రోహక కార్యకలాపాలకు పాక్‌లో ఉన్న హ్యాండ్లర్లకు ప్రత్యక్ష సంబంధం ఉందనేందుకు ఆధారాలు లభ్యమయ్యాయి."కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్‌ల సాయంతో ఈ జిహాదీలు ఎక్కడి నుంచైనా యుద్ధం చేస్తున్నారు. వదంతులు వ్యాప్తి చేస్తున్నారు. యువతను ప్రభావితం చేస్తున్నారు" అని ఓ అధికారి వెల్లడించారు. ఓ సోషల్ మీడియా పోస్టు ద్వారా ఇటీవల స్థానికంగా ఇలాగే ఇరువర్గాల మధ్య చిచ్చుపెట్టారని, కానీ.. శ్రీనగర్ పోలీసులు సకాలంలో స్పందించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చిందన్నారు. మరో కేసులో.. ఓ వర్గానికి చెందినవారి వ్యక్తిగత వివరాలు సామాజిక మాధ్యమాల్లో లీకయ్యాయని తెలిపారు. ఈ వ్యవహారంలో ఓ యువకుడిని అరెస్టు చేసి విచారించగా.. పొరుగుదేశం నుంచి తనకు ఈమేరకు ఆదేశాలు వచ్చాయని చెప్పాడన్నారు.ఓవైపు యుద్ధ హెచ్చరికలు.. మరోవైపు నీటి కోసం అభ్యర్థనలు వాస్తవానికి, 2017లోనే ఈ పెడ ధోరణి మొదలైంది. 2019లో ఆర్టికల్ 370 రద్దు అనంతరం స్థానికంగా ఇంటర్నెట్‌పై ఆంక్షల వంటి చర్యలతో దీనికి అడ్డుకట్ట పడింది. అయితే.. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఈ 'బెడ్‌రూం జిహాదీ'లు మరోసారి జడలు విప్పినట్లు అధికారులు తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని అస్థిరపరచడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం వారి లక్ష్యాలు కావొచ్చని చెప్పారు. ముప్పు ఎప్పటికప్పుడు రూపం మార్చుకుంటోందని ఈ పరిణామాలు చాటిచెబుతున్నాయని, దీన్ని మొగ్గలోనే తుంచేయాలని జమ్మూకశ్మీర్ మాజీ డీజీపీ కుల్దీప్ ఖోడా పేర్కొన్నారు.

## సిబిఐకి న్యాయవాద దంపతుల హత్య కేసు

మొదటిపేజీ తరువాయి

ఈ విషయంపై మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో వామనరావు దంపతులను దారుణంగా హత్య చేస్తే విచారణ కూడా సరిగ్గా చేపట్టలేదని మంత్రి విమర్శించారు. దీంతో వామనరావు తండ్రి వెంకటరావు సుప్రీంకోర్టును ఆశ్రయించారని తెలిపారు. సుప్రీంకోర్టు తాజాగా ఈ కేసును సీబీఐకి అప్పగించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. వారి హత్యలో గత ప్రభుత్వంలోని కొంతమంది పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉందని, దోషులు ఎంతటివారైనా చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు- చెప్పారు. న్యాయవాదుల రక్షణ కోసం, చట్టం తెచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

## ఎసిబికి చిక్కిన మహిళా ఉద్యోగి

మొదటిపేజీ తరువాయి

తాజాగా వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ లో ఏసీబీ అధికారులకు ఓ మహిళా ఉద్యోగి లంచం తీసుకుంటూ దొరికింది. రంగారెడ్డి జిల్లా ఏసీబీ డిఎస్పి ఆనంద్ కుమార్ చెప్పిన వివరాల ప్రకారం .. రెవెన్యూ సెక్షన్లలో పనిచేస్తున్న సుజాత అనే మహిళా ఉద్యోగిని రూ.15 వేల లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు . నవాబుపేట మండల పరిధిలోని రెండు ఎకరాల అసైన్డ్ భూమి విషయంలో తహాశీల్దార్ కార్యాలయానికి ప్రొసిడింగ్ కాపీ పంపించడానికి మహిళా ఉద్యోగి సుజాత 20 వేల రూపాయలు లంచం డిమాండ్ చేసింది . కలెక్టర్ సంతకం కోసం టేబుల్ మీద ఫైల్ పెట్టడానికి 5 వేల రూపాయలు ముందుగానే ఫోన్ పే ద్వారా తీసుకుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏసీబీకి ప్రభుత్వం ఫ్రీహ్యాండ్ ఇచ్చింది. అవినీతి అధికారులు ఏ శాఖలో ఉన్నా.. ఏ హోదాలో ఉన్నా.. ఉపేక్షించొద్దని తేల్చిచెప్పింది. ఫిర్యాదులు రాగానే వెంటనే రంగంలోకి దిగాలని ఆదేశించింది. దీంతో లంచాల విషయం తెలిస్తే తమకు సమాచారం అందించాలంటూ టోల్ ఫ్రీ నంబర్ కు, వాట్సాప్ నంబర్ ను జనంలోకి విస్తృతంగా ఏసీబీ అధికారులు తీసుకెళ్తున్నారు.

## భారీ వర్ష సూచన.. వచ్చే మూడు రోజులు ప్రజలు బయటకు రావొద్దు: హైడ్రా

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: భాగ్యనగరంలో రేపటి నుంచి మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైడ్రా వెల్లడించింది. ఈ నెల 13, 14, 15 తేదీల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే సూచనలున్నాయని తెలిపింది. మేడ్చల్ జిల్లాతోపాటు సైబరాబాద్ పరిధిలో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. 10 నుంచి 15 సెం.మీ వర్షపాతం పడుతుందని, కొన్ని ప్రాంతాల్లో 20సెం.మీ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని పేర్కొంది. వచ్చే మూడు రోజులు ప్రజలెవరూ బయటకు రావొద్దని హైడ్రా విజ్ఞప్తి చేసింది. ముంపు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

వచ్చే రెండు రోజులు పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని ప్రభుత్వానికి సూచించినట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఐటీ ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ హోమ్ చేసేందుకు ప్రాధాన్యమివ్వాలని కమిషనర్ సూచించారు.

## బిఆర్ఎస్ కదనభేరీ సభ మరోమారు వాయిదా

మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు కరీంనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నేత గంగుల కమలాకర్.. తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రకటన చేశారు. భారీ వర్ష సూచన కారణంగానే ఈ సభను వాయిదా వేసినట్లు- ఆయన తెలిపారు.

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని.. అందులో భాగంగా ఆగస్ట్ 14, 15, 16, 17 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే సూచించిందని వివరించారు. ఈ క్రమంలో ఈ కదన భేరి సభను వాయిదా వేసినట్లు- తెలిపారు. అయితే వాతావరణం అనుకూలించిన తర్వాత ఈ సభను నిర్వహించాలని పార్టీ అగ్రనాయకత్వం భావిస్తుందని పేర్కొన్నారు. సభను మళ్లీ ఎప్పుడు నిర్వహించనున్నది మరికొద్ది రోజుల్లో నిర్ణయించి.. ప్రకటిస్తామని గంగుల కమలాకర్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలు గమనించాలని సూచించారు. తొలుత ఆగస్ట్ 8వ తేదీన కరీంనగర్ వేదికగా ఈ కదన భేరీ సభ నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకత్వంనిర్ణయించింది. కానీ ఎందుకో.. ఈ సభను ఆగస్ట్ 14వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రకటించింది. కానీ భారీ వర్షాల నేపథ్యంలో ఈ సభను మరోసారి వాయిదా వేశారు. ఈ సభ ఏర్పాటుపై వాయిదాల పర్వం కొనసాగడానికి వెనుక ఉన్న కారణాలు ఏమై ఉంటాయనే ఒక చర్చ అయితే రాజకీయ వర్గాల్లో బలంగా సాగుతోంది. అయితే వర్షాల కారణంగానే

బీసీ కదన భేరి సభను వాయిదా వేస్తున్నట్లు- కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రకటించారు. ప్రస్తుతం సభ నిర్వహణకు అన్నీ ఏర్పాట్లు- జరుగుతున్నాయని, అయితే.. వాతావారణ శాఖ చెప్పిన అంశాలను పరిగననలోకి తీసుకొని వాయిదా వేస్తున్నట్లుగా పేర్కొన్నారు. భేరి ఎప్పుడు నిర్వహించే విషయాన్ని.. తదుపరి ప్రకటిస్తామని, బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు ఈ విషయాన్ని గమనించాలని ఆ ప్రకటనలో కోరారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం ఆగస్ట్ 13 2025

## అభివృద్ధి.. సంక్షేమమే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యం

### - ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్

**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్ (రామగుండం), ఆగస్టు 12:** గత ప్రభుత్వం కాజిపల్లి నివాసులను పట్టించుకునే పాపన పోలేదు రామగుండం ఎమ్మెల్యే ఎం. ఎస్.రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్ తెలిపారు. గత 25, 30 సంవత్సరాల నుంచి జరుగని అభివృద్ధి ప్రజా పాలనలో



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో చేస్తున్నామని వివరించారు. ఎన్టిపిసి సమీపంలోని కాజిపల్లి ఎస్సీ కాలనీ లో సీసీ రోడ్డు అభివృద్ధి కార్యక్రమాన్ని కమిషనర్ అరుణశ్రీ, స్థానిక కౌన్సిలర్లు, నాయకులతో కలిసి మంగళవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. టి.యు.ఎఫ్.ఐ.యు.డి.సి. కింద రూ. 50 లక్షల నిధులతో సి.సి రోడ్ నిర్మాణం కోసం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఆగస్టు 12:** జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధ్యర్యంలో రామగుండం ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు మత్తు వదులు వ్యసనాలకు లోను కాకు అనే నినాదంతో సోదర బంధం రాఖీల కార్యక్రమం




నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రామగుండం ఎస్.ఐ ఎం జి.సంధ్య మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ బి.స్వర్ణలత మాట్లాడుతూ నేటి యువత తమ వంతు బాధ్యతగా డ్రగ్స్ రహిత సమాజాన్ని కొరకు కృషి చేయాలని సూచించారు. అదే విధంగా జిల్లా మహిళా సాధికారత కోఆర్డినేటర్ దయా అరుణ మాట్లాడుతూ మహిళల హక్కులు, అంగన్వాడీ సేవలు, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, సఖి సేవలు, టోల్ ఫ్రీ నెంబర్స్, ఉన్నత విద్యా, లింగ వివక్షత, పీఓసీఎస్ఓ చట్టం, బాల సదనం సేవలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.మోహన్, అధ్యాపక బృందం, పోలీసు సిబ్బంది, డిఅడిక్షన్ సిబ్బంది, ఐసిపిఎస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జలకలను సంతరించుకుంటున్న సింగూర్ ప్రాజెక్ట్

**కరపత్రం ప్రతినిధి అందోలు** సంగారెడ్డి జిల్లాలోనే అతిపెద్ద ప్రాజెక్టు అయినా అందోలు నియోజకవర్గం సింగూరు ప్రాజెక్టు, ప్రస్తుతం నిండుకుండలా నీటితో కళకళలాడుతుంది, సింగూరు ప్రాజెక్టుపై రైతులు పెట్టుకున్న ఆశలకు జీవం పోసినట్లు, ప్రాజెక్టుకు మళ్ళీ జలకళ సంతరించుకుంది, గత నాలుగు రోజుల నుండి కురిసిన భారీ వర్షాలకు, ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి



చేరుతోంది, ప్రస్తుతం 4058 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా ఔట్ ఫ్లో 633 క్యూసెక్కులుగా కొనసాగుతుంది, ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 21.799 టీఎంసీల వరకు నీటి నిలువ ఉంది.

## నాయిని చెరువుల పడి వ్యక్తి మృతి



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఆగస్టు 12** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని పాత అంబేద్కర్ చౌరస్తా ఏరియాలో గల హోటల్లో గత కొన్ని సంవత్సరాలుగా జబ్బర్ అనే వ్యక్తి పనిచేస్తూ జీవన కొనసాగిస్తున్నాడు మంగళవారం జమ్మికుంట నాయిని చెరువులో తేలుతూ మృతదేహం కనిపించింది జబ్బర్ మానసికంగా అనారోగ్యంతో కొంతకాలంగా హోటల్లో పని మానేసినట్లు తెలుస్తుంది నాయిన చెరువు లో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడ లేదా ఏమైనా కారణాలు ఉన్నాయా తెలియాల్సి ఉంది ఈ మేరకు పోలీసులు ప్రమాదవస్తు అనుమానాస్పద మృతి అని ఆరా తీస్తున్నట్లు తెలిసింది

## యాంటీ నార్కోటిక్స్ శిక్షణకు హాజరైన మేజిక్ రాజా



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఆగస్టు 12:** తెలంగాణ రాష్ట్ర మాదక ద్రవ్యాల నిరోధక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ బంజారాహిల్స్ లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ లో మంగళవారం నిర్వహించిన శిక్షకులకు శిక్షణ కార్యక్రమంలో స్థానిక మోటివేషనల్ స్పీకర్ మేజిక్ రాజా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (ఈగిల్) డైరెక్టర్ జనరల్ సందీప్ శాండిల్యా, అదనపు డీసీపీ కృష్ణ మూర్తి, డీఎస్పీ సంతోష్ కుమార్, శ్రీనివాస్, ఇంపాక్ట్ మాస్టర్ మోటివేషనల్ స్పీకర్ గంపా నాగేశ్వరరావు తదితరులు సహజ, కృత్రిమ మాదక ద్రవ్యాలలో రకాలు, వాటిని వినియోగించే విధానం, టీనేజ్ యువత మాదక ద్రవ్యాలకు ఎలా బానిసలవుతారు? ఫెడ్లర్లుగా ఎలా మారుతారు? మాదక ద్రవ్యాల వ్యసనపరులను ఎలా గుర్తించాలి? అనే అంశాల పట్ల శిక్షణనిచ్చారని రాజా తెలిపారు. ఈ శిక్షణ పొందిన వారు.. వారి ప్రాంత విద్యార్థులు మాదక ద్రవ్యాల పట్ల ఆకర్షితులు కాకుండా అవగాహన కలిగించాలని సూచించారన్నారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలి

### - బిజెపి పశ్చిమ కన్వీనర్ జాడి బాల్ రెడ్డి

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 12** కరీంనగర్ పట్టణం బిజెపి పశ్చిమ కన్వీనర్ జాడి బాల రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా దేశ ప్రజలందరి ప్రతి ఇంటిపైన స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఇంటిపైన జాతీయ జెండా ఎగురవేయాలని హర్ ఘర్ తిరంగా ర్యాలీని శాతవాహన యూనివర్సిటీ నుండి విద్యానగర్, సుష్మ స్వరాజ్ చౌరస్తా నుండి కోర్ట్ అంబేద్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. జాడి బాల రెడ్డి మాట్లాడుతూ 13, 14వ తేదీలో జోన్ లోని ప్రతి ఇంటి యజమానులు వారి యొక్క ఇండ్లపైన జాతీయ జెండాలను ఎగరవేయాలని అలాగే 15వ తేదీ



సాయంత్రం జాతీయ జెండాలను వితరణ చేయాలని అన్నారు. అలాగే 15వ తేదీన వారి వారి కూడలలో ,సంఘ భవనాలలో రాజకీయ పార్టీ ఆఫీసుల్లో ,ఇతర ప్రదేశాల్లో జాతీయ జెండాలను ఎగరవేసి పెద్ద పండుగల చేయాలని అన్నారు. పహల్గాం లో జరిగిన సంఘటన దృశ్య దేశ ప్రజలందరూ ఐక్యతతో ముందుండాలని అన్నారు. ఇలాంటి ముష్కరులను చిత్తు చేసే శక్తి మన దగ్గర ఉందని చాటి చెప్పే విధంగా స్వతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరపాలని అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ దేశం కోసం అహర్నిశలు కష్టపడుతున్నారనీ ,ప్రపంచంలోనే అతిపెద్ద శక్తివంతమైన దేశంగా ఉండేటట్లు కృషి చేస్తు, శత్రు దేశాలు సైతం మోడీ ని చూసి భయపడే పరిస్థితి వస్తుందని అన్నారు .ఇట్టి కార్యక్రమంలో మాజీ పశ్చిమ జోన్ అధ్యక్షులు నరహరి లక్ష్మారెడ్డి, శక్తి కేంద్ర ఇన్చార్జిలు వాసు, పోన్నల రాము, ఉప్పరపల్లి శ్రీనివాస్, గుండారపు సంపత్, వరాల దేవేందర్, జిల్లా ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి గోదారి నరేష్, బూత్ అధ్యక్షులు నాంపల్లి శంకర్, తిరుమల్ రెడ్డి, బండ రాకేష్, లక్ష్మణ్, ప్రకాష్, న్యాతర ప్రవీణ్, రవి నాయక్ పంబాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

## రసాయన ,ఔషధ పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించకుండా తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు.





**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మీద నర్సాపూర్** మంగళవారం ప్రజావాణి హాల్ నందు ఫ్యాక్టరీలు, రసాయన పరిశ్రమల్లో భద్రతపై ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కమిటీతో సమావేశం నిర్వహించారు.గత జూన్ 30 న సంగారెడ్డి జిల్లా, పాశమైలారం లో సంభవించిన అతిపెద్ద విస్ఫోటనాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఫ్యాక్టరీలు, ప్రత్యేకించి రసాయన పరిశ్రమలు, ఔషధ యూనిట్లలో ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో భాగంగా జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన కమిటీలు ఏర్పాటు చేసి, ఆ కమిటీల ద్వారా ఆయా పరిశ్రమలలో భద్రతను తనిఖీ చేసి నివేదికలను సమర్పించాలని ఆదేశించిన విషయం తెలిసిందే.ఈ అంశం పై మెదక్ జిల్లాలో జిల్లా కలెక్టర్ పరిశ్రమలు, కార్మిక ,కాలుష్య నియంత్రణ మండలి, తదితర సంబంధిత శాఖల అధికారులతో జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్మికులు భద్రతపై దృష్టి సారిస్తూ కర్మాగారాలలో పనిచేసే కార్మికుల యొక్క :ఫోన్ నంబర్స్ పూర్తి సమాచారం యాజమాన్యం దగ్గర ఉండాలని, పరిశ్రమలలో పనిచేసే కార్మికులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా, చూడాలని, మత్తు పదార్థాలు వాడుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిన పక్షంలో యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఫ్యాక్టరీల డైరెక్టర్ అంతర్నిర్మిత భద్రతా వ్యవస్థలను అభివృద్ధి చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి కమిటీ ఆయా రసాయనిక పరిశ్రమలు, ఔషధ యూనిట్లను తనిఖీ చేసి నిర్దేశించిన ప్రొఫార్మా లో నివేదిక సమర్పించాలని , ఇదే అంశంపై నివేదిక అందిన తర్వాత తిరిగి సమీక్షిస్తానని కలెక్టర్ తెలిపారు.జిల్లాలోని అన్ని పరిశ్రమలు ,రసాయనిక, ఔషధ యూనిట్లలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత ఉందని కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ , ఆర్డీవోలు మెదక్ రమాదేవి, నర్సాపూర్ మహిపాల్ రెడ్డి, తూప్రాన్ జై చంద్ర రెడ్డి, జడ్పీ సీఈవో ఎల్లయ్య ,డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మోహన్ బాబు,డైరెక్టర్ ఆఫ్ బాయిలర్స్ శ్రీనివాసరావు, కర్మ గారాల జిల్లా ఉప ప్రధాన అధికారి శ్రీమతి లక్ష్మీ కుమారి, జిల్లా పరిశ్రమల మేనేజర్ ప్రకాష్ రావు జిల్లా అగ్నియాపక శాఖ అధికారి, కాలుష్య నియంత్రణ మండలి, కార్మిక శాఖ అధికారులు,ఇతర సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# విద్యార్థి టీసీ కి 2000 డిమాండ్ చేసిన విద్యోదయ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఆగస్టు 12** జమ్మికుంట పట్టణంలోని విద్యోదయ ప్రైవేట్ హైస్కూల్ లో టిసి కోసం రెండు వేల రూపాయలు డిమాండ్ చేయగా విద్యార్థి తండ్రి ఎడ్ల శ్రీనివాస్ నిరసన వ్యక్తం చేస్తూ విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేసింది కాకుండా టిసి కోసం విద్యార్థుల తల్లిదండ్రుల నుండి టిసి కోసం అదనంగా రెండు వేల రూపాయలు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు, నేను నిరుపేద రైతును ఫీజు కట్టడానికి డబ్బులేక ప్రభుత్వ స్కూళ్లో నా కుమారుడిని చేర్పించాను అని, రెండు నెలల నుంచి విద్యోదయ స్కూల్ యాజమాన్యం నన్ను ఇబ్బంది పెట్టగా బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు దృష్టికి తీసువెళ్ళానని, స్వయంగా బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు స్కూల్ కి వచ్చి టిసి కి డబ్బులు ఎందుకు అనగా స్కూల్ ప్రిన్సిపాల్



కృష్ణారెడ్డి రెండు వేల రూపాయలు కడితేనే టిసి ఇవ్వడం జరుగుతుంది అని, మాకు జిల్లా, మండల విద్యాశాఖాధికారులకు ఖర్చులు ఉంటాయని తెలిపారు, టిసి కి డబ్బులు కడుతాం దానికి రసీదు ఇవ్వమని అడుగగా అలా ఇవ్వమని తెలుపగా, మండల విద్యాధికారి హేమలత ని ఫోన్లో కొలకాని రాజు సంప్రదించగా టిసి కి ఎలాంటి డబ్బులు కట్టాల్సిన అవసరం లేదని, మీరు వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారని బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లగా సాయంత్రం వచ్చి టిసి తీసుకోవాలని బతిమాలడం ఏంటని ప్రశ్నించారు, ఈ సందర్భంగా కొలకాని రాజు మాట్లాడుతూ జమ్మికుంట పట్టణంలోని విద్యోదయ స్కూల్ పై మండల, జిల్లా విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేస్తామని, జమ్మికుంటలోని ఏ విద్యా సంస్థలైన టిసిల కోసం విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అక్రమంగా డబ్బులు డిమాండ్ చేస్తే విద్యా సంస్థలను ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు, ఈకార్యక్రమంలో జిల్లా యువమోర్చ అధికార ప్రతినిధి కైలాసకొటి గణేష్, పట్టణ ఉపాధ్యక్షులు ఇటుకాల స్వరూప, రాకేష్ ఠాకూర్, మేడిపల్లి మహేష్, సిరియాల విజయ్, మ్యాదరి శంకర్ తదితరులు పాల్గొన్నారు

# మాది పేదల ప్రభుత్వం

## విద్య, వైద్యానికి ప్రాధాన్యమిస్తున్న తెలంగాణ ప్రభుత్వం

- రూ 200కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నాం
- బిఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వాలె
- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళలాంటివి మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావ్

**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మీద నర్సాపూర్** మాది పేదల ప్రభుత్వమని..తెలంగాణ రాష్ట్రంలోని ప్రజా పాలన ప్రభుత్వంలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావ్ అన్నారు.అభివృద్ధి, సంక్షేమం తమ ప్రభుత్వానికి రెండు కళ్ళలాంటివని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని జికెఆర్ గార్డెన్స్ లో మెదక్ నియోజకవర్గం లోని 223మంది లబ్ధిదారులకు రూ 63లక్షల విలువ గల సిఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి వైపు పయనిస్తుందన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన



విదంగా ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు.అన్నదాతలకు రైతు భరోసా, రుణమాఫీ అందజేసినట్లు తెలిపారు.నియోజకవర్గం లో మౌళిక వసతుల కల్పన కోసం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తున్నామన్నారు.నియోజకవర్గ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయల నిధులు తెచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.మెదక్ ప్రజలను కుటుంబ సభ్యులుగా భావించి కష్ట సుఖాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారి సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తామన్నారు.రామాయంపేట పట్టణంలో రూ 200కోట్ల తో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నామని తెలిపారు.పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో



ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణ లో ప్రసిద్ధి గాంచిన ఏడుపాయల దుర్గ భవాని టెంపుల్, ప్రపంచంలో ప్రసిద్ధి గాంచిన మెదక్ చర్చి ల అభివృద్ధి కి గత ప్రభుత్వం ఒక్కరూపాయి కూడా కేటాయించలేదని ఆరోపించారు.

ఈ కార్యక్రమం లో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, శంకర్, బ్లాక్ కాంగ్రెస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొజ్జ పవన్, శ్రీనివాస్ చౌదరి,మహేందర్ రెడ్డి, నాగరాజు, ఆంజనేయులు గౌడ్, లింగం, శంకర్, రాజిరెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్ క్రిష్ణ, కోర్వి రాములు, హంజాద్, లల్లూ, మహిపాల్ యూత్ కాంగ్రెస్ మెదక్ నియోజకవర్గ అధ్యక్షులు భరత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ కానిస్టిట్యూషన్ క్లబ్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించిన ఎంపీ రవిచంద్ర

**కరపత్రం ప్రతినిధి న్యూఢిల్లీ**



బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మంగళవారం కానిస్టిట్యూషన్ క్లబ్ పాలక మండలి ఎన్నికల్లో తన ఓటు హక్కు వినియోగించారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఉన్న ఈ ప్రతిష్ఠాత్మక "కానిస్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా"లో ప్రస్తుత, మాజీ పార్లమెంట్ సభ్యులు సభ్యులుగా కొనసాగుతారు. పాలక మండలి ఎన్నుకోవడానికి జరిగిన పోలింగ్‌లో రవిచంద్రతో పాటు బీఆర్ఎస్ సీనియర్ నేతలు, మాజీ ఎంపీలు బడుగుల లింగయ్య యాదవ్, బాల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు. ఎన్నికలు ఉత్సాహభరితంగా కొనసాగాయి.

# లఢక్ లో రెడ్ క్రాస్ సేవా స్ఫూర్తి జండా...




**హనుమకొండ జిల్లా కరపత్రం ప్రతినిధి**

హనుమకొండకు చెందిన యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్ ఇ.వి. సాత్విక లడఖ్‌లోని ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మోటారు మార్గాలలో ఒకటైన ఖర్దుంగ్లా (ఎత్తు: 17,582 అడుగులు) వద్ద రెడ్ క్రాస్ జెండాతో సేవా భావనను ప్రతిబింబించారు. సేవల్లో ప్రత్యేకతను చాటుతున్న రెడ్ క్రాస్ స్ఫూర్తి చిహ్నం జెండాగా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా సాత్విక మాట్లాడుతూ, "పదవ తరగతి నుండి రెడ్ క్రాస్ సొసైటీ పట్ల, మా నాన్న చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల పట్ల ఆకర్షితురాలిని అయ్యాను అని అన్నారు. జాతీయ స్థాయిలో శిక్షణ పొంది, అనేక రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొన్నాను. నాతో పాటు మరి కొందరిలో రెడ్ క్రాస్ పట్ల చైతన్యం కలిగించాలి. ఈ క్రమంలో సమాజ సేవ నా జీవన లక్ష్యం" అని తెలిపారు.సమాజ సేవ పట్ల ఆమె చూపుతున్న అంకితభావం, ధైర్యం, త్యాగం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. ఈ విజయంతో తెలంగాణ రాష్ట్ర యువతకు ఆమె ఒక ఆదర్శంగా నిలిచారు.

# ఒక సాహితీ కిరణం రాలిపోయింది..

## – ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్...

**హన్మకొండ జిల్లా కరపత్రం ప్రతినిధి**



కవితా ప్రపంచాన్ని తన కవితలతో ఆలోచింపచేసిన కవయిత్రి అని శెట్టి రజిత మరణం సాహితీ ప్రియులకు తీరని లోటని ప్రముఖ సామాజికవేత్త తెలంగాణ నేత్ర అవయవ దాన అసోసియేషన్ సభ్యులు నిమ్మల శ్రీనివాస్ అన్నారు. ఎన్నో పుస్తకాలు రచించి విలువలకు పెట్టబడిన వ్యక్తి అనిత అని అతి సాదా జీవితాన్ని గడిపి ఎంతోమందికి ఆదర్శప్రాయంగా నిలిచిన తన మరణం సాహితీ లోకానికి తీరనిలోటని, బ్రతికుండగా సమాజ హితం కోసం పోరాడి మరణించిన తర్వాత కూడా తన నేత్రాలను దానం చేసి, తన పార్థివ దేహాన్ని వైద్య విద్యార్థుల ప్రయోగాల నిమిత్తం కాకతీయ మెడికల్ కళాశాలకు అప్పగించటం గొప్ప విషయమని భౌతికంగా తను మన నుండి దూరమైనా అందరి హృదయాలలో చిరస్థాయిగా అనిత నిలుస్తుందని అంటూ వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# విద్య మౌలిక సదుపాయాల లోపం.. ఎస్ఎఫ్ఐ ఆందోళన

## – జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్

**కరపత్రం ప్రతినిధి పరకాల**



పరకాల పట్టణంలోని పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తక్షణమే మౌలిక సదుపాయాల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వివిధ విద్యాసంస్థల్లో పర్యటించిన ఆయన, జూనియర్ కళాశాలలో టాయిలెట్ సదుపాయం లేకపోవడం, వర్షం వస్తే విద్యార్థులు నడవలేని పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బాయ్స్ హై స్కూల్‌కు కొత్త భవనం నిర్మించాలని, మల్లారెడ్డి ప్రైమరీ స్కూల్‌లో పైకప్పు రంధ్రాలు, వర్షపు నీరు తరగతుల్లో చేరడం వంటి సమస్యల వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థులు చదువులో అంతరాయం లేకుండా ఉండేందుకు స్థానిక ఎమ్మెల్యే వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మడికొండ ప్రశాంత్, బొజ్జ హేమంత్, పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, కార్యదర్శి కోగీల సాయి తేజ, ప్రభుత్వ కాలేజ్ అధ్యక్షుడు ప్రభాస్, ప్రధాన కార్యదర్శి అజయ్, ఉపాధ్యక్షుడు రోహిత్, సహాయ కార్యదర్శి అవినాష్, బన్నీ, రాహుల్, విజయ్, సూర్య, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# పంచముఖ శివాలయాన్ని దర్శించుకున్న కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి దంపతులు....

**హన్మకొండ జిల్లా కరపత్రం ప్రతినిధి**



ఆత్మకూరు మండలంలోని పంచముఖ శివాలయాన్ని మంగళవారం రోజున వరంగల్ కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ప్రజలకు ఎల్లవేళలా సుఖ సంతోషాలు చూపించాలని దేవుని వేడుకున్నారు. కూడా చైర్మన్ వెంట ఆత్మకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, ఆత్మకూరు మాజీ సర్పంచి సామ్యూల్, తదితరులు ఉన్నారు.

# సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం.....

**హన్మకొండ జిల్లా కరపత్రం ప్రతినిధి**

మంగళవారం ఉదయం 11:30 గంటలకు ఆత్మకూరు మండలం అగ్రంపాడు గ్రామంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్. అప్పయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత వానకాల సీజన్లో వచ్చే వ్యాధుల నివారణలో భాగంగా సర్వోదయ సంస్థ గ్రామీణ ప్రజల కోసం ఉచితంగా మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వం సమన్వయంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ప్రభుత్వ శాఖల నుండి సహకారం అందిస్తామని అన్నారు. గ్రామీణ ప్రాంతంలోని పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తున్న కార్యక్రమాలు నిర్వహిస్తున్న సర్వోదయ సంస్థ ఇతర ప్రాంతాల్లో కూడా ఇలాంటి మెగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ ఓ అన్నారు. సర్వోదయ సంస్థకు పూర్తి సహకారాన్ని జిల్లా యంత్రాంగం ద్వారా అందిస్తామని ఈ సందర్భంగా అన్నారు. మంగళవారంరోజు నిర్వహించిన



మెగా ఉచిత వైద్య శిబిరంలో జనరల్ ఫిజీషియన్స్, డెంటిస్ట్ ఆప్తోమాలజిస్ట్ వైద్యులు రోగులను పరీక్ష చేశారు. అనంతరం రక్త పరీక్షలు, ఎక్స్ రే, ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహించి డిఎంహెచ్ఓ చేతులమీదుగా ఉచితంగా మందులు కళ్లద్దాలు పంపిణీ చేయడం జరిగింది. సర్వోదయ సంస్థ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత 30 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు సర్వోదయ సంస్థ ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో ఉన్న పేద ప్రజలకు ఉచితంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్న సర్వోదయ సంస్థ రానున్న రోజుల్లో ప్రభుత్వ శాఖల సమన్వయంతో గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు, ఈరోజు నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరంలో సుమారు 512 మంది వివిధ వైద్య సేవలు, మందులు, కండ్ల అద్దాలు తీసుకోవడం జరిగింది. ఆత్మకూర్ ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న సందర్భంగా సర్వోద సంస్థ ఇంత పెద్ద మొత్తంలో పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, మందులను మరియు వివిధ రకాల టెస్టులను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అయిపోయింది డాక్టర్ .జితేందర్ రెడ్డి, జనరల్ ఫిజీషియన్, డాక్టర్ భరత్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్.సమాఖ్య, జనరల్ ఫిజీషియన్, డాక్టర్.మనోజ్ఞ, డెంటిస్ట్, డాక్టర్. సంపత్, ఆప్తమాలోజిస్ట్, పారామెడికల్ టీం రెడ్డి,రోహిణి నర్సింగ్ కాలేజ్ సిబ్బంది ప్రణీత,పాల్ జిప్సన్, సర్వోదయ సంస్థ సిబ్బంది కవిరాజ్,రవీందర్, అక్తర్, వనిత, శ్రీలత నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా గ్రంథాలయం ఆధ్వర్యంలో కొమ్మాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్ పంపిణీ..

**కరపత్రం ప్రతినిధి గీసుగొండ :**

కొమ్మాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలోని ప్రజా గ్రంథాలయం వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ముప్పై వేల రూపాయల విలువైన స్పోర్ట్స్ యూనిఫామ్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజా గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల అనిల్ సాయిలి రాజేంద్రప్రసాద్ లు , అధ్యక్షులు మండల రాజు, ఉపాధ్యక్షులు సతీష్, ముఖ్య సలహాదారులు బొజ్జు నరేష్, తంగళ్ళపల్లి యశ్వంత్ , ఊరుకొండ రంజిత్, దొడ్డిపెళ్ళి మురళి , కాసు నవీన్, న్యాలా రాజు, పావని దేవులపల్లి, కక్కెర్ల నరేష్, కడారి మహేష్, గాదం చరణ్, బోళ్ల శివ కుమార్, ఈర్ల సురేష్, మరియు ప్రజా గ్రంథాలయ సభ్యులు మరియు ప్రధానోపాధ్యాయులు మోహన్ రావు, మరియు ప్రధానోపాధ్యాయులు ప్రజాపతి,ఉపాధ్యాయులు రాము, స్వర్ణలత, విశ్వేశ్వరా రావు, నటేషం మాలతి, రాజిరెడ్డి, పద్మ, దేవర సాగర్, మరియు గ్రామ యువకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అధ్యక్ష ఉపాధ్యక్షులు మరియు వ్యవస్థాపకులు విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తుకై సలహాలు సూచనలు అందించడం జరిగింది మరియు పాఠశాల విద్యార్థులకు ఎల్లవేళలా ప్రజా గ్రంథాలయం అన్ని రకాల సహాయ సహకారాలు



చేయడానికి ముందుంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా 2024 –25 పదవ తరగతి ప్రథమ మరియు ద్వితీయ స్థానాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థిని ధరంసోత్ పండు, కాగిత మహేష్ లను ఘనంగా సన్మానించడం జరిగింది.

# పల్లెరాములుకు స్టార్ ఆఫ్ తెలంగాణ జాతీయస్థాయి పురస్కారం

## – 3 వేల పైన షార్ట్ ఫిల్మ్స్ నిర్మించి నటన
## – తెలంగాణ యాస బాషలతో ప్రజలను చైతన్య పరుస్తూ షార్ట్ ఫిల్మ్స్

**నర్సంపేట,కరపత్రం ప్రతినిధి**

వరంగల్ జిల్లా నర్సంపేట మండలానికి చెందిన పల్లెరాములును స్టార్ ఆఫ్ తెలంగాణ జాతీయస్థాయి పురస్కారం వరించింది.సోషల్ మీడియా వేదికగ మూడు వేలకు పైగ షార్ట్ ఫిల్మ్స్ నిర్మించి తెలంగాణలోని పల్లేల జీవిత విదానాలు, యాస బాషలతో ప్రజలను చైతన్య పరుస్తున్నారు.వీటిని గుర్తించిన జాతీయ స్థాయి హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ వారు ఆదివారం హైదారాబాద్ రవింద్రభారతిలో పల్లె రాములుకు స్టార్ ఆఫ్ తెలంగాణ జాతీయస్థాయి పురస్కారాన్ని అందచేశారు.ఇందులో బాగంగ పల్లె రాములుకు జాతీయ పురస్కారాన్ని హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ జాతీయ అద్యక్షుడు కొంపెల్లి సత్యనారాయణతో పాటు స్వర్ణగిరి దేవాలయ అదినేత మనేపల్లి రామారావు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.సామాజిక స్ప్రుహను కల్పించే విదంగ లఘుచిత్రాలను చేస్తున్నందుకు గాను ఈ అవార్డును అందచేస్తున్నట్టు అద్యక్షులు కొంపెల్లి సత్యనారాణ తెలియజేశారు.తనకు జాతీయ స్థాయి స్టార్ ఆఫ్ తెలంగాణ





పురస్కారాన్ని అందచేసినందుకుగాను పల్లే రాములు హ్యూమన్ రైట్స్ నిర్వాహకులకు దన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా పల్లెరాములు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గ్రామీణ హితివృత్తాలు,జీవన విధానం,రైతులు,ప్రజలు




ఎదుర్కొంటున్న సమస్యలపై సినిమాలు తీసే ఆలోచనలు ఉన్నట్లు ప్రకటించారు.

# నేషనల్ లైబ్రరియన్స్ డే





**కరపత్రం ప్రతినిధి గజ్వేల్**

నేషనల్ లైబ్రరియన్స్ డే గవర్నమెంట్ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. భారత దేశంలో లైబ్రరీ సైన్స్ పితామహులు పద్మశ్రీ డాక్టర్ యస్ ఆర్ రంగనాథన్ పుట్టిన రోజును నేషనల్ లైబ్రరియన్స్ డే గా జరుపుకుంటారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి కమల క్రిస్టియానా, డాక్టర్ ఉమా రాణి లైబ్రేరియన్ డాక్టర్ ఆవులపటి వేణు అధ్యాపకులు పాల్గొన్నారు. రంగనాథన్ లైబ్రరీ సైన్స్ విభాగానికి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులను ఉద్దేశించి ఆయన చేసిన సేవలను తెలియజేశారు. ఎస్.ఆర్. రంగనాథన్ భారతీయ లైబ్రేరియన్, విద్యావేత్త, గణిత శాస్త్రజ్ఞుడు భారతదేశంలో లైబ్రరీ సైన్స్ పితామహుడిగా పరిగణించబడ్డాడు. అతని రచనలు ప్రపంచవ్యాప్తంగా ప్రభావాన్ని చూపాయి. ఈ రంగానికి ఆయన చేసిన అత్యంత ముఖ్యమైన రచనలు లైబ్రరీ సైన్స్ యొక్క ఐదు నియమాలుమరియు మొదటి ప్రధాన కోణ వర్గీకరణ వ్యవస్థ,కోలన్ వర్గీకరణ మరియు లైబ్రరీ సైన్స్, డాక్యుమెంటేషన్ రియు ఇన్ఫర్మేషన్ సైన్స్ పితామహుడిగా ఆయన పరిగణించ బడుతున్నారు. ఈ రంగంలో ఆయన ప్రాథమిక ఆలోచనలకు ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా ప్రసిద్ధి చెందారు. ఆయన పుట్టినరోజును ప్రతి సంవత్సరం భారతదేశంలో జాతీయ లైబ్రేరియన్ దినోత్సవంగా జరుపుకుంటారు.. ఆయన 1944 నుండి 1953 వరకు ఇండియన్ లైబ్రరీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నారు. 1957లో ఆయన ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఫర్ ఇన్ఫర్మేషన్ అండ్ డాక్యుమెంటేషన్ (ఎఫ్ ఐ డి ) గౌరవ సభ్యుడిగా ఎన్నికయ్యారు గ్రేట్ బ్రిటన్ లైబ్రరీ అసోసియేషన్ జీవితకాలం వైస్-ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. గ్రంథాలయ శాస్త్రం యొక్క ఐదు నియమాలు (1931) కోలన్ వర్గీకరణ వ్యవస్థ (1933). ఈ కార్యక్రమం లో సీనియర్ అధ్యాపకులు డాక్టర్ మురళీధర్, డాక్టర్ సరోజ, డాక్టర్ సుజాత, డాక్టర్ మహా లక్ష్మీ, డాక్టర్ బాల చంద్రం, డాక్టర్ జయరాజు, అన్వర్ పాల్గొన్నారు.